
కూన శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు


కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతు తెలుపుతున్న పద్మశాలి సంఘం నాయకులు..


తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

బీజేపీతో యువతకు భరోసా

ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేస్తాం ● కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో బీజేపీ ప్రభజనంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కొట్టుకుపోవడం ఖాయమని, కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండాను ఎగుర వేస్తామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం దుండిగల్‌కు చెందిన గొట్టిముక్కల కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరగా శ్రీశైలంగౌడ్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డిలు వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ యువతకు బీజేపీ భరోసా ఇస్తోందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తామన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించివేసిందని, త్వరలో జరిగే ఎన్నికల్లో ఆ పార్టీ వీఆర్ఎస్ తీసుకుంటుందన్నారు.

◆ గాలరామారం డివిజన్ శ్రీరామ్ నగర్‌కు చెందిన పద్మశాలి సేవా సంఘం నాయకులు షాపూర్‌నగర్‌లోని నివాసంలో శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. పద్మశాలి సంఘం నాయకులు శ్రీనివాస్, నారా వెంకటేశం, యాదగిరి, శ్రీధర్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ ఉన్నారు.

◆ శ్రీనివాస్‌నగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ కాలనీ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు శ్రీశైలంగౌడ్‌ను గెలిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు.

◆ నిజాంపేట్ బండారి లేఅవుట్, జీపీఆర్ లేవుట్, రాజీవ్‌గృహకల్ప ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా బీజేపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశాయి.


కూన శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరిన దుండిగల్ గ్రామ యువకులు..


నిజాంపేట్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు..

బీఆర్ఎస్ పార్టీలో చేరిక

చింతల్: చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ అధ్యక్షుడు, ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నేత కొండల శ్రీనాథ్‌రావు సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంగళవారం రాత్రి భగత్ సింగ్‌నగర్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలను హనుమంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. పచ్చిమట్ల మదన్ గౌడ్, పరుశురామ్, బాలు, నరేందర్ గౌడ్, ఈశ్వర్, వెంకటరెడ్డి, శివకుమారి, ప్రకాష్, మంజు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

తొమ్మిది నామినేషన్లు దాఖలు

కుత్బుల్లాపూర్: ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఊపందుకుంది.. బుధవారం తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించినట్లు కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా దుర్గారావు దూలం, మహ్మద్ మహిషన్, మేకల కార్తీక్ యాదవ్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున రాసూరి చంద్రశేఖర్, ఇండియా ప్రజాబంధు పార్టీ నుండి తోట సువర్ణ, విద్యార్థుల రాజకీయ పార్టీ నుండి చౌదరిగారి స్వాతి, సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి నుండి మేకల కార్తీక్ యాదవ్, అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుండి దొంతుల రమేష్ ముదిరాజ్‌లు నామినేషన్ పత్రాలు అందజేశారు.

జంగ్ తెలంగాణ 2023

కాంగ్రెస్ పార్టీలో చేరిన 'కొలన్'

నిజాంపేట్: బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం తన అనుచరులతో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఆయన తెలిపారు.


రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


రౌడీషీటర్లతో సమావేశమైన మేడ్చల్ డీసీపీ శబరీష్, ఏసీపీ రఘునందన్‌రావు

కుత్బుల్లాపూర్: ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని మేడ్చల్ డీసీపీ శబరీష్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లతో డీసీపీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడటం, సమావేశాలు నిర్వహించడం, అలజడి సృష్టించేందుకు యత్నిస్తే జైలు ఊచలు లెక్కించాల్సి ఉంటుందని, ఎన్నికలు ముగిసేంత వరకు బాధ్యతయుతంగా మెలగాలని సున్నితంగా హెచ్చరించారు. మీ కదలికలపై పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే అరెస్టులు తప్పవన్నారు. ఈ సమావేశంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రఘునందన్‌రావు, సీఐ ప్రశాంత్, ఎస్ఐలు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ప్రారంభం



కుత్బుల్లాపూర్: అయ్యప్ప మాలాధారులకు బుధవారం బీరప్పనగర్‌లోని శ్రీబీరప్పస్వామి ఆలయంలో శ్రీధర్మశాస్త్ర సేవాసమితి ఆధ్వర్యంలో భిక్ష ప్రారంభించారు. డిసెంబరు 12వ తేది వరకు భిక్ష కొనసాగుతుందని, సమీపంలోని అయ్యప్ప మాలాధారులు మధ్యాహ్న సమయంలో భిక్ష స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

మమ్మల్నెలా అడ్డుకుంటారు?


కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు..

పోలీసుల తీరుపై కార్మికుల అసహనం

నిన్న అనుమతించి.. ఈరోజు ఎందుకు అనుమతించలేదు

కుత్బుల్లాపూర్: పద్దెనిమిది నెలలుగా జీతభత్యాలు లేకుండా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించకుండా కాలయాపన చేస్తున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధుల తీరుకు వ్యతిరేకంగా జీడిమెట్ల పారిశ్రామికవాడ సూపర్ మాక్స్ కంపెనీ కార్మికులు శాసనసభ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కొందరు నామినేషన్ పత్రాలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం కూడా జేఏసీ నాయకులు కార్మికులతో కుత్బుల్లాపూర్ రిటర్నింగ్ కార్యాలయానికి నామినేషన్ పత్రాలు పొందేందుకు తరలివచ్చారు. అయితే అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు వీరిని లోనికి అనుమతించలేదు. 144 సెక్షన్ నిబంధన అమలులో ఉందని, ఇప్పుడు లోనికి అనుమతించడం కుదరదని తేల్చి చెప్పారు పోలీసులు. సాయంత్రం 4.30 గంటల సమయం తర్వాత రిటర్నింగ్ కార్యాలయానికి వచ్చి నామినేషన్ పత్రాలు పొందవచ్చని పోలీసులు చెప్పినట్లు కార్మికులు మీడియా ప్రతినిధులతో పేర్కొన్నారు. ఆర్ ఓ కార్యాలయం వద్ద బందోబస్తులో ఉన్న పోలీసుల తీరును ప్రశ్నిస్తున్నారు కార్మికులు. మంగళవారం నామినేషన్ పత్రాలు కోసం వచ్చిన తమ కార్మికులను ముగ్గురు ముగ్గురు చొప్పున నామినేషన్ పత్రాలు పొందేందుకు అనుమతించారు. కానీ ఈరోజు 144 సెక్షన్ అంటూ లోనికి అనుమతించకుండా ఉండటంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిన్న రిటరిన్నంగ్ కార్యాలయంలోనికి వెళ్లడానికి అడ్డురాని 144 సెక్షన్ నిబంధన ఈ రోజు ఎందుకు అడ్డు వచ్చిందని వారు ప్రశ్నిస్తున్నారు. కేవలం తమని అడ్డుకునే ప్రయత్నంలో భాగంగానే వారు ఈ విధంగా కారణాలు చెబుతున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. తమని ఎన్ని విధాలుగా అడ్డుకున్నా ఎట్టి పరిస్థితుల్లో నామినేషన్ వేయడానికి సిద్ధమవుతున్నట్లు సూపర్ మాక్స్ కంపెనీ కార్మిక జేఏసీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. కాగా మంగళవారం 30 మంది కార్మికులు నామినేషన్ పత్రాలు తీసుకువెళ్లగా, బుధవారం మరో 24 మంది తీసుకువెళ్లడంతో వీరి సంఖ్య 54కు చేరుకుంది.

మహిళల కోసం ఉచిత బస్సు సర్వీసు



సుభాష్‌నగర్: మహిళల భద్రత కోసం ఫ్రీ షూట్లీ ఫర్ ఉమెన్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ పేరిట మహిళల కోసం నడుపుతున్న ఉచిత బస్సు సేవలు ఫలితాన్ని ఇస్తున్నాయి. నగరంలో ఈ సర్వీసులు 12 వరకు నడిపిస్తున్నాయి. కుత్బుల్లాపూర్ రూట్‌లో ఒక సర్వీస్‌ను నడుపుతున్నారు. ఉదయం 8 గంటలకు బాలానగర్ నుండి ఈ బస్సు బయలుదేరి ఐడీపీఎల్, చింతల్, షాపూర్‌నగర్, జీడిమెట్ల, దూలపల్లి పారిశ్రామిక వాడ మీదుగా కొంపల్లి, సుచిత్ర, బోయిన్‌పల్లి, బాలనగర్, పటాన్‌చెరు వైపు నడిపిస్తున్నారు. అదే విధంగా సాయంత్రం 4 గంటలకు ఈ సర్వీసును నడిపిస్తున్నారు. ఈ సర్వీసు ప్రారంభమై సంవత్సరం గడుస్తున్నా కానీ చాలామందికి తెలియదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


దుర్గయ్య (ఫైల్)

జగద్గిరిగుట్ట: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. దేవేందర్‌నగర్ గాలిపోచమ్మ బస్తీకి చెందిన దుర్గయ్య(45) స్థానికంగా రాళ్లు కొట్టుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజాము 4 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లిన దుర్గయ్యను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో అతని కుటుంబ శోకసంద్రంలో మునిగిపోయింది.

పరారీలో ఉన్న ఇద్దరు దొంగల అరెస్ట్

జీడిమెట్ల: హోటళ్లలో దొంగతనాలు చేస్తూ పరారీలో ఉన్న ఇద్దరు దొంగలను జీడిమెట్ల, బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా పట్టుకుని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాకేష్ బెహ్రా(36), అస్తా డెహూరీ(47) ఇద్దరు వివిధ హోటళ్లలో వంటమనుషులుగా పనిచేసేవారు. అక్కడే మంచివాళ్లుగా నటిస్తూ హోటళ్లలో ఏ వస్తువులు ఎక్కడ ఉంటాయో తెలుసుకుని ఇద్దరు కలిసి దొంగతనానికి పాల్పడేవాళ్లు. దొంగతనాల కేసులో గతంలో ఇద్దరు జైలుకి వెళ్లొచ్చారు. జైలుకువెళ్లొచ్చిన తర్వాత కూడా ఇద్దరు బుద్ధి మార్చుకోకుండా రాత్రిపూట పలు హోటళ్లలో చొరబడి సెల్‌ఫోన్‌లు, డబ్బుతో పాటు అధారాలు దొరకకుండా సీసీ కెమరాల డీవీఆర్‌లను ఎత్తుకెళ్లేవారు. కాగా ఇటీవల జీడిమెట్ల పీఎస్‌కు దగ్గరలో ఉన్న ఓ హోటల్‌లో ఇద్దరు దొంగతనానికి పాల్పడ్డారు. హోటల్ యజమాని ద్వారా ఫిర్యాదు అందుకున్న జీడిమెట్ల పోలీసులు, బాలానగర్ సీసీఎస్‌టీం ఇద్దరికోసం నిఘా ఏర్పాటు చేశారు. జీడిమెట్లలో జరిగిన దొంగతనంపై ఇన్వేస్టిగేషన్ చేసిన పోలీసులు పలు సాంకేతిక అధారాలు సేకరించి రాకేష్, అస్తాలు దొంగతనం చేసినట్లుగా గుర్తించారు. వీరిద్దరిని అరెస్టు చేసి విచారణ జరపగా పోలీసులు విచారణలో దొంగతనాలకు పాల్పటినట్లు ఒప్పుకున్నారు. అనంతరం ఇద్దరిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి బుధవారం రిమాండుకు తరలించారు. వీరిద్దరిపై సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో మొత్తం 19కేసులు ఉన్నాయి. దొంగలను పట్టుకోవడంలో జీడిమెట్ల సీఐ పవన్, బాలానగర్ సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ బాలరాజు, జీడిమెట్ల డీఐ నదీమ్‌హుస్సేన్, డీఎస్సై దర్మియా నాయక్, ప్రత్యేక చొరవచూపారు.

కూకట్‌పల్లి టికెట్ జనసేనకు ఎలా కేటాయిస్తారు?

కూకట్‌పల్లి: కూకట్‌పలి బీజేపీ కార్యాలయంలో బుధవారం అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బీజేపీ భవిష్యత్ కార్యాచరణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మాట్లాడుతూ కూకట్‌పల్లి అసెంబ్లీ టికెట్ విషయంలో పొత్తులో ఉన్న జన సేన పార్టీకేనంటూ వస్తున్న వార్తలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ కూకట్‌పల్లి అసెంబ్లీ టికెట్ ఎట్టిపరిస్థితుల్లోనూ బీజేపీ అభ్యర్థికే ఇవ్వాలని బీజేపీ అధిష్టానానికి తెలిసేలా పలు నిరసన కార్యక్రమాలు సైతం చేయటం జరిగిందన్నారు. ఏళ్లుగా పోలింగ్‌బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేశామన్నారు. కనీస క్యాడర్ లేని జనసేప పార్టీకి టికెట్ ఎలా ఇస్తారని ఆయన మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర నాయకులు సూర్యరావు, సూర్యప్రకాష్, వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో సర్వతోముఖాభివృద్ధి

అభివృద్ధి సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి


ప్రగతినగర్‌లోని కేజీఆర్ ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్..

నేడు ఎమ్మెల్యే నామినేషన్ దాఖలు..

◆ గురువారం ఉదయం 11 గంటల నుండి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే అభ్యర్థి కెపి వివేకానంద మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ శంభిపూర్‌తో కలిసి సూరారం కట్ట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం భారీ ఎత్తున ర్యాలీగా సూరారం నుండి షాపూర్‌నగర్ మీదుగా కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి నామినేషన్ వేయనున్నారు.

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
- పలుచోట్ల బీఆర్ఎస్‌లో చేరిక



వివేకానంద్ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు..


సుభాష్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు..


కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన పలు పార్టీల నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు అన్నారు. బుధవారం ప్రగతినగర్‌లోని కేజీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ టీడీపీ అధ్యక్షుడు అనిల్ కరుటూరితో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని, సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేపడతామని స్పష్టం చేశారు. నాగేశ్వర్ రావు, కిరణ్ తలసాని, దిలీప్ వర్మ, సెక్రటరీ గంగాధర్, ఏనుగుల శ్రీకాంత్‌రెడ్డి, ఆవుల సురేష్‌యాదవ్, నర్సింగ్‌రావు, తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు మేకల వెంకటేష్, సురేష్‌రెడ్డి, రవికిరణ్, శ్రీనివాస్ రెడ్డి, బాలాజీ నాయక్, చిట్ల దివాకర్, గోపాల్‌రెడ్డి, జగదీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీనగర్‌లోని స్కైటన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఆత్మీయ సమ్మేళానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీసీ బంధు పథకం ద్వారా 60 మంది విశ్వబ్రాహ్మణులకు లబ్ధి చేకూరిందని, రానున్న రోజుల్లో మరింత మందికి పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపి తనను గెలిపించాలని వివేకానంద్ కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కమలాకర్, కిషోర్ చారి, ఎం.వై. చారి, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్యవేదిక అధ్యక్షులు బాలబ్రహ్మచారి, రాజు చారి, శ్రీనివాస్ చారి, వెంకటేష్ చారి, శ్యామల, మంజుల పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ నాయకులు..


విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో పాలొన్న ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న దృశ్యం..

పరిశీలకుడిగా సమీర్‌ఖాన్ నియామకం



జగద్గిరిగుట్ట: టీపీసీసీ మైనార్టీ శాఖ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ సమీర్‌ఖాన్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీల పరిశీలకుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఏఐసీసీ మైనార్టీ ఛైర్మన్, ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి ఆదేశాల మేరకు తెలంగాణ ఇంచార్జి పర్వస్ ఆజ్మీ ఉత్తర్వులు జారీ చేశారు.

నామినేషన్ దాఖలు చేసిన అరెకపూడి గాంధీ


నామినేషన్ వేయటానికి బయలుదేరిన బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ



ఆల్విన్‌కాలనీ: బీఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుకు ఆయన నివాసం నుంచి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆయనకు నీరాజనాలు పలికారు. ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, ఉప్పలపాటి శ్రీకాంత్, రోజాదేవి రంగారావు, మంజుల రఘునాథ్ రెడ్డి, సింధు ఆదర్శ్ రెడ్డిలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేకానందనగర్‌లోని రామాలయం, హైదర్‌నగర్‌లోని విజయ దుర్గ మైసమ్మ ఆలయం, గంగారంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందానగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడి నుంచి ర్యాలీగా వచ్చి శేరిలింగంపల్లి డివజిన్ పరిధిలోని తారానగర్ తుల్జాభవానీ దేవాలయం వద్దకు చేరుకుని ఆనవాయితీగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. జోనల్ కార్యాలయానికి చేరుకొని కార్పొరేటర్‌లతో కలిసి నామినేషన్ పత్రాలను అందజేశారు.